క్లుప్తంగా

నేడు తాళ్లరేవులో జగనన్నకు చెబుదాం

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని బుధవారం తాళ్లరేవులో నిర్వహించనున్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 8.30 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కానున్నారని ఎంపీడీఓ ఎం.అనుపమ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు వీరేశ్వరునికి లక్ష రుద్రాక్షార్చన

ఐ.పోలవరం: శ్రావణమాసం మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వరునికి బుధవారం లక్ష రుద్రాక్షార్చన నిర్వహించనున్నారు. పవిత్ర శైవ క్షేత్రం కాశీ నుంచి తెచ్చిన రుద్రాక్షలను బుధవారం ఉదయం స్థానిక వృద్ధ గౌతమీ గోదావరిలో పండితులు సంప్రోక్షణ చేయనున్నారు. స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్షార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు జరగనున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు తెలిపారు.

ఘనంగా జాతీయ పోషకాహార ఉత్సవాలు



ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోషకాహార ప్రదర్శన

ఐ.పోలవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సీడీపీఓ ఐ.విమల అధ్యక్షతన పోషకాహార ప్రదర్శన మంగళవారం ఏర్పాటు చేశారు. మండలంలోని 70 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు వివిధ రకాల పోషకాహారాలను తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలే కాకుండా ప్రజలందరూ పోషకాహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ విమల సూచించారు. ప్రదర్శనను ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, సీహెచ్ నాగలక్ష్మి, జె.మీనాక్షి తదితరులు తిలకించారు.

కవి బీవీవీకి తానా ప్రశంసా పత్రం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, కోనసీమ రచయిత సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ద్వారా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ నెల 9వ తేదీన తానా సంస్థ నిర్వహించిన అంతర్జాల కవి సమ్మేళనంలో బీవీవీ పాల్గొని కాళోజీపై తన కవితా గానాన్ని వినిపించారు. దీంతో బీవీవీకి ఆన్‌లైన్ ద్వారా ప్రశంసా పత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

రూ.15 లక్షల విలువైన అక్రమ మద్యం ధ్వంసం



పోలేకుర్రులో అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

తాళ్లరేవు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో సుమారు రూ.15.26 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని పోలేకుర్రు గ్రామశివారులో ధ్వంసం చేసినట్లు సెబ్ అధికారులు మంగళవారం తెలిపారు. తాళ్లరేవు, కాకినాడ సౌత్, కాకినాడ నార్త్, పిఠాపురం ఎస్ఈబీ స్టేషన్‌లలో సుమారు 702 కేసుల్లో సీజ్ చేసిన పన్ను చెల్లించిన 12,551 మద్యం బాటిళ్లతో పాటు పన్ను చెల్లించని 3,708 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు పి.సునీల్ కుమార్, జీవీ భవానీ, కె.రామ్మోహన్ రావు, కేవీ స్వామి, నాగవల్లి పాల్గొన్నారన్నారు.

రెండు పాఠశాలల ఎంపిక

అమలాపురం రూరల్: అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ వేడుకలకు రెండు పాఠశాలలను కోనసీమ జిల్లా నుంచి ఎంపిక చేశామని కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామచంద్రపురం డివిజన్ నుంచి సత్యవాడ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, అమలాపురం డివిజన్‌లో అంబాజీపేట మండలం తొండవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశామని చెప్పారు. ఈ నెల 16న తొండవరం, సత్యవాడ పాఠశాలల్లో జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా స్థాయి ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంగీతం రామకృష్ణ సత్యారామ్‌ను 96662 12381 సెల్ నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

- ఈ నెల 15 నుంచి ఇంటింటి సర్వే
- నిపుణుల పర్యవేక్షణలో వైద్య సేవలు

అల్లవరం: పేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే ప్రతీ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో నెలలో రెండు పర్యాయాలు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్స్‌కు దీటుగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సెప్టెంబర్ 30 నుంచి ప్రతి గడపకూ తీసుకెళ్లనున్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం 15 రోజుల ముందు నుంచే వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి సర్వే చేయనున్నారు. ఈ సర్వేలో ఇంటింటా సభ్యుల వివరాలతో పాటు దీర్ఘకాలిక రోగుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు ఏమేం సర్టిఫికెట్లు కావాలో ఏ విధంగా నమోదు చేశారో అదే తరహాలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలోనూ ముందుగా సర్వే నిర్వహించనున్నారు.

ప్రత్యేక శిబిరాల్లో వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పీహెచ్‌సీలకు చెందిన ఇద్దరు డాక్టర్లతో పాటు మరో ఇద్దరు వైద్య నిపుణులు ప్రత్యేక శిబిరాల్లో వైద్య సేవలు అందించనున్నారు. గుండె, కిడ్నీ, మూత్రాశయ వ్యాధులు, గైనిక్ విభాగాల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహిస్తారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైతే ఉన్నత వైద్యాన్ని అందించే చర్యలు తీసుకుంటారు. వీరితో పాటు బాలింతలు, ఎదుగుదల లోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారు.

ఎంపీడీఓ, తహసీల్దార్ల పర్యవేక్షణలో..

సచివాలయాల పరిధిలోని స్థానిక పాఠశాలల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరాల్లో రోగ నిర్ధారణ కోసం రక్త పరీక్షలు, ఈసీజీ, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నారు. రోగ రహిత ఆంధ్రప్రదేశ్‌ని చూడాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని గ్రామగ్రామాన అమలు చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్యాధికారులు, ఎంపీడీఓ, తహసీల్దార్లు, కార్యదర్శులు కార్యాచరణ చేస్తున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ల పర్యవేక్షణలో ప్రతి సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడానికి సమాయత్తమవుతున్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

వలంటీర్లకు శిక్షణనిస్తున్నాం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని సచివాలయాల్లో పాఠశాలలను గుర్తించాం. ఇంటింటి సర్వే నిర్వహించేందుకు వలంటీర్లకు ఒకరోజు శిక్షణ అందిస్తున్నాం. ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణకు సచివాలయానికి రూ.40 వేలు చొప్పున నిధులను ప్రభుత్వం విడుదల చేయనుంది.

– బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంపీడీఓ, అల్లవరం మండలం

వంతెన పనుల పరిశీలన



విలసవిల్లిలో వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి నుంచి గ్రామ పరిధిలో ఉన్న వడ్డి వారి దళితపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో పంట కాలువపై వంతెన లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో పంట కాలువపై వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ పనులను మంగళవారం సర్పంచ్ ఊర్మిళాదేవి పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, చేనేత సొసైటీ అధ్యక్షుడు పుత్స్యల ఏసు, కోలా ఏసు, నందుల సురేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ డి.ప్రసన్న పాల్గొన్నారు.

రైతుల సంతృప్తి ఆనందదాయకం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలో పంట కాలువలు, డ్రైన్ల సమస్యలపై సత్వరమే స్పందించడం వల్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో రైతు బాంధవుడిగా పేరుగాంచిన జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాను రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధుల కింద జిల్లా వ్యాప్తంగా కాలువలు, డ్రైన్లలో తూడు తొలగింపు కోసం మొత్తం 14 పనులు రూ.66.22 లక్షలతో చేపట్టి ఇప్పటి వరకు 12 పనులు పూర్తి చేశామని తెలిపారు. తూడు తొలగింపు కోసం మొత్తం 28 పనులు రూ.266.78 లక్షలతో చేపట్టి 18 పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కింద సుమారు రూ.94.06 లక్షలతో పనులు చేపట్టి పూర్తి చేసినట్టు చెప్పారు. వీటిలో ప్రధానంగా రామేశ్వరం మొగ డీసిల్టింగ్ కోసం సుమారు రూ.19.65 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేశామన్నారు. ముమ్మిడివరం మండలం సౌత్ అద్దాల కాలువ మట్టి తవ్వకాలకు రూ.36 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేశామన్నారు. రూ.1.27 కోట్లతో రెండు పనులకు టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యులు జిన్నూరి రామారావు (బాబి), అగ్రికల్చర్ బోర్డు మెంబర్ జయ వెంకటేశ్వరరావు, ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు పాలకమండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షుడు పుండరీకాక్షుడు, రైతు నాయకులు సూరిబాబు భాస్కరరావు, ఏసుబాబు, ఎ.వెంకటరమణ జి.తమ్మేశ్వరరావు జిల్లా కలెక్టర్‌ను సన్మానించిన వారిలో ఉన్నారు.



కలెక్టర్ హిమాన్షుశుక్లాను సత్కరిస్తున్న రైతులు

రైస్‌మిల్లుల బకాయిల చెల్లించే చర్యలు

కోనసీమ జిల్లాలో రైస్ మిల్లులకు సంబంధించిన బకాయిలను ప్రాధాన్య క్రమంలో చెల్లించేందుకు చర్యలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు సన్నద్ధత, పెండింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం రవాణాకు ఉపయోగించే వాహనాలను ముందస్తుగా ఆర్బీకేలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రతి లారీ, ట్రక్కు నమోదు కావాలని ఆదేశించారు. పెండింగ్ బకాయిలు దశలవారీగా ప్రాధాన్యత క్రమంలో చెల్లించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గోనె సంచులు, యూజర్ చార్జీలు, డ్రయర్ల ఏర్పాటు, మిల్లింగ్ చార్జీలు, ధాన్యం రవాణా చార్జీల పెండింగ్ అంశాలపై మిల్లర్లతో సుదీర్ఘంగా చర్చించి చెల్లింపులకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి మండలంలో ఒక డ్రయర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కోనసీమ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పట్టాభి రామయ్య చౌదరి, కార్యదర్శి ఇందుకల బుజ్జి, రైస్ మిల్లర్ల ప్రతినిధులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎస్.సుధాసాగర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ పాపారావు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలతో వ్యాయామ ఉపాధ్యాయులు

యానాం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో జోనల్ గేమ్స్ ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం బ్యాడ్మింటన్ విభాగంలో అండర్–14 బాలురు, బాలికలు, అండర్–17 బాలురు, బాలికల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్ 14లో బాలుర విభాగంలో రీజెన్సీ స్కూల్ ప్రథమ స్థానం, రాజీవ్‌గాంధీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. అండర్ 17లో మహాత్మాగాంధీ స్కూల్ ప్రథమ, రీజెన్సీ ద్వితీయ స్థానాన్ని గెలుచుకున్నాయి. విజేతలను విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ అభినందించారు. విజేతల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను స్థానాలను సాధించిన వారిని కారైకల్‌లో జరిగే స్టేట్‌మీట్‌కు ఎంపిక చేస్తారని ఆర్గనైజింగ్ కార్యదర్శి పాము సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు నక్కల సుబ్బన్న, చింతం రామకృష్ణ, కొప్పనాతి భాస్కర్, వడ్డి వరప్రసాద్, జల్లి చంద్రశేఖర్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తాళ్లరేవు: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా మాతాశిశువులకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏఎస్‌డీ మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పోషకాహార నిపుణురాలు మల్లెల సువర్చల తెలిపారు. మంగళవారం చొల్లంగి సెక్టారు పరిధిలో పోషకాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చొల్లంగిపేట పంచాయతీ కార్యాలయం వద్ద తాళ్లరేవు ఐసీడీఎస్ అధికారి వంజరాన మాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు సీమంతాలు చేశారు.

అలాగే చిన్నపిల్లలకు అన్నప్రాసన జరిపించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి లలితా నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చొల్లంగిపేటలో పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

వారాహి అఖండ హోమానికి కలశస్థాపన



వారాహి పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: శ్రావణ మాస అమావాస్య సందర్భంగా 90 గంటల పాటు నిర్వహించనున్న వారాహి అఖండ హోమాన్ని కలశస్థాపన ద్వారా స్థానిక ఎర్ర వంతెన వద్ద గల బ్యాంకు కాలనీలో మంగళవారం ప్రారంభించారు. 90 గంటల పాటు సాగే ఈ హోమం వచ్చే శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతితో ముగుస్తుందని అక్షయ పాత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పోతురాజు రామకృష్ణారావు తెలిపారు. తొలుత వారాహి పతాకాన్ని ఆవిష్కరించి హోమ మహోత్సవాన్ని నిర్వహించారు. అక్షయ పాత్ర ప్రతినిధులు పోతురాజు నాగ కనకదుర్గ, సుంకర ప్రసాద్, శ్రీవాణి, యెనుముల అరుణకుమారి, తూము వాసు, జక్కంపూడి శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో హోమం జరిగింది.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత

యానాం: వ్యవస్థల్లో పారదర్శకతను, బాధ్యతను పెంచడానికి సమాచార హక్కు చట్టం–2005 ఉపకరిస్తుందని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎల్‌డీసీ, యూడీసీ, అసిస్టెంట్‌లకు, సూపరింటెండెంట్‌లకు సమాచారహక్కు చట్టం–2005, నోటింగ్ అండ్ డ్రాఫ్టింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఏఓ మునిస్వామి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం యొక్క ప్రాథమిక లక్ష్యం పౌరులకు సాధికారితను కల్పించడంతో పాటు అవినీతిని అరికట్టడమన్నారు. దీనివల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు బలం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్రికుమారన్, స్పిన్‌కో పుదుచ్చేరి మాస్టర్ ట్రైనర్ ఆర్.మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ మునిస్వామి

సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష

అల్లవరం: సంక్షేమ క్యాలెండర్ ఆధారంగా లబ్ధిదారులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల పనితీరుపై ఎంపీడీఓ కృష్ణమోహన్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను గడువులోగా లబ్ధిదారులకు చేర్చాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. జీజీఎంపీ, హౌసింగ్, జేపీవీ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్రాకి, జేకేసీ ఈకేవైసీ తదితర 14 రకాల విషయాలపై ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్, చిత్రంలో ఎంపీపీ శేషగిరిరావు

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

యానాం: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా భవిష్యత్‌లో మంచి ప్రజాస్వామ్యయుత నాయకులుగా తయారవుతారని నారాయణ టెక్నో స్కూల్ జోనల్ ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బలరామ్ మహంతిలు పేర్కొన్నారు. మంగళవారం సీనియర్, జూనియర్ విద్యార్థుల క్యాబినెట్ సభ్యులు, క్లబ్ ప్రెసిడెంట్లకు ప్రమాణస్వీకారం తరువాత వారికి బ్యాడ్జిలను అందజేశారు. కార్యక్రమంలో సుంకర మూర్తి పాల్గొన్నారు.

పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లతో పేద కుటుంబాల్లోని అవ్వాతాతల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ అన్నారు. మంగళవారం స్థానిక 29వ వార్డులో కొత్తగా మంజూరైన 8 సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, వార్డు సచివాలయం అడ్మిన్ ప్రదీప్ పాల్గొన్నారు. అనంతరం వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి రమణ పరిశీలించారు.



కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి డాక్టరేట్

ముమ్మిడివరం: మండల పరిధిలోని సీహెచ్ గున్నేపల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన పాము ఆనంద్‌తో పాటు సత్యవరప్రసాద్, అతని భార్య గసాడి శాంతిలకు డాక్టరేట్ లభించింది. ఆంధ్రా యూనివర్సిటీలో 87, 88, 89, 90 స్నాతకోత్సవంలో వారు ముగ్గురూ డాక్టరేట్‌లు అందుకున్నారు. విశాఖపట్నం నగర హౌసింగ్ ఫైనాన్స్‌పై వినియోగదారుల అవగాహన అనే అంశంపై ఆనంద్, ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకుల్లో కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్(తూర్పుగోదావరి జిల్లా) అనే అంశంపై సత్య వరప్రసాద్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు తదితర అంశాలపై శాంతి పరిశోధన చేశారు. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు పీహెచ్‌డీ పట్టాలను పొందడంపై పలువురు అభినందిస్తున్నారు.



పీహెచ్‌డీ పట్టా తీసుకుంటున్న దృశ్యం

గ్రామాల్లో లయన్స్ క్లబ్ సేవలు

యానాం: గ్రామీణ ప్రాంతాల్లోకి లయన్స్ క్లబ్ సేవలు విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వల్లూరి సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక యానాం బైపాస్ జంక్షన్‌లో లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత భోజన శిబిరం ద్వారా స్థానికులకు, కార్మికులకు భోజనాలను వడ్డించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఈవీవీ ఈశ్వరకుమార్, వజ్రపు కోటేశ్వరరావు, రీజియన్ చైర్మన్ ఎం.శ్రీరామరాజు పాల్గొన్నారు.

రాట ముహూర్తం

యానాం: స్థానిక చిల్డ్రన్స్ పార్క్ వద్ద విజయగణపతి కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని రాట ముహూర్తం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

గ్రాండ్ పేరెంట్స్ డే

అమలాపురం టౌన్: స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూలులో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డేను విద్యార్థుల తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మల సమక్షంలో విజ్ఞానదాయకంగా వేడుకగా నిర్వహించారు. ముఖ్యంగా కుటుంబ బంధాలు, బంధుత్వాలు, నైతిక విలువలు, మన సంస్కృతీ సంప్రదాయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్కూలు ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీజీ మెడికల్ కోర్సుల ఫీజుల ఖరారు

యానాం: 2023–24 విద్యా సంవత్సరానికి గాను అన్ ఎయిడెడ్ ప్రైవేట్ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ద్వారా పోస్టుగాడ్యుయేషన్ మెడికల్(క్లినికల్, నాన్ క్లినికల్), డెంటల్, ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు అభ్యసించేవారికి ఫీజులు నిర్ణయిస్తూ పుదుచ్చేరి ఫీజు కమిటీ చైర్మన్ రిటైర్డ్ జడ్జి ఎస్.కన్నమ్మాళ్ ఆదేశాలు జారీ చేశారు. వివిధ మెడికల్ కళాశాలల్లో ఫీజు స్ట్రక్చర్‌ను సైతం విడుదల చేశారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి కె.కందవేలు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

కార్యదర్శులు కీలక భూమిక పోషించాలి

అమలాపురం రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల పరిపాలనలో కీలక భూమిక పోషించాలని డీపీఓ వి.కృష్ణకుమారి పిలుపునిచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జిల్లావ్యాప్తంగా ఉన్న 392 మంది కార్యదర్శులకు నాలుగు బ్యాచ్‌లుగా వారం రోజుల పాటు శిక్షణనిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు వివిధ గ్రామ పంచాయతీల్లో అనధికారిక లేఅవుట్లు ఏర్పడకుండా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి బొద్దిరాజు, డీఎల్‌బీఓ విజయ థామస్, టౌన్ ప్లానింగ్ అధికారి సుబ్బారావు తదితరులు పంచాయతీ చట్టాల గురించి వివరించారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీపీఓ వి.కృష్ణకుమారి

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వారిలో 20 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు.

వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

అల్లవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సీహెచ్ బాబూరావు అధికారులను ఆదేశించారు. బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని నిర్మాణంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్ద పీట వేస్తే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపుతారన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. రెండు జగనన్న లేఅవుట్లలో 177 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 37 ఇళ్లు పూర్తయ్యాయని, 61 బీబీఎల్ స్థాయిలో ఉన్నాయని, వివిధ స్థాయిల్లో 77 ఇళ్లు ఉన్నాయని హౌసింగ్ ఏఈ సుబ్బారావు పీడీకి తెలిపారు. అల్లవరం మండలలో బోడసకుర్రుతో పాటుగా అల్లవరం, గోడితిప్ప, గోడి, కోడూరుపాడు గ్రామాల్లో ఏడు జగనన్న లే అవుట్లలో 509 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు 76 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని పీడీకి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి వర్మ, ఇన్‌స్పెక్టర్ రాము, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.



బోడసకుర్రులోని జగనన్న లేఅవుట్‌ని పరిశీలిస్తున్న పీడీ బాబూరావు